క్లుప్తంగా

3 పతకాలతో విజయకేతనం



విజేతను అభినందిస్తున్న ప్రో ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎంవి కుమార్ రెడ్డి ప్రొఫెసర్ 7వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 పతకాలు సాధించినట్టు ప్రో ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న మంగళగిరి శంషేర్ ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, కాంస్య పతకం, ఫ్రీ స్టైల్‌లో రజతం పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

సత్యదీక్షపై భక్తుల అసంతృప్తి

ఏలేశ్వరం: కలియుగ దైవమైన శ్రీసత్యనారాయణస్వామి వారి సత్యదీక్షల నిర్వహణపై అధికారుల వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏడాది ఏలేశ్వరంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన సుమారు 200 మంది భక్తులు సత్యదీక్షలు చేపడుతుంటారు. వీరికి వస్త్రాలతో పాటు మాలలు అన్నవరం దేవస్థానం అధికారులు అందిస్తుంటారు. ఈఏడాది 17వ తేదీ నుంచి దీక్ష ప్రారంభం కావల్సి ఉండగా ఇప్పటివరకు వస్త్రాలు, మాలలు అందజేయలేదు. దీనిపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి దీక్షాకు సంబంధించిన సామాగ్రి అందజేయాలని భక్తులు కోరుతున్నారు.

దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి

కోటనందూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయడం అమానుషమని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే అన్నారు. మంగళవారం కోటనందూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ దళితుడు కారణంగానే ఈ దాడికి పాల్పడ్డారుకారణమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై దేశ ప్రధాని, ప్రతిపక్షనేతలు స్పందించిన తీరు సంతోషదాయకమన్నారు. దేశ అత్యున్నత వ్యక్తిపై జరిగిన దాడిని అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో కండించి నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికైన ప్రగళ్లపాటి



ప్రగళ్లపాటి కనకరాజు (ఫైల్)

గోకవరం: మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆదర్శ విద్యాసంస్థల అధినేత ప్రగళ్లపాటి కనకరాజు విద్యా ప్రమాణాలను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లేందుకు, ఆర్య వైశ్య సమాజ అభ్యున్నతికి కృషి చేసిన నిస్వార్థ సేవలకు జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికైయ్యారు. ఈ నెల 28న పుదుచ్చేరిలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తి.ఎస్.రంగస్వామి అవార్డును కనకరాజుకు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎన్నికైన సందర్భంగా ఆయనకు మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆదర్శ విద్యాసంస్థల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇద్దరి వ్యక్తులపై కేసు

కోటనందూరు: ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలు చేసి మోసగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీ.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలో బొద్దవరం గ్రామానికి చెందిన మళ్ల మల్లేశ్వరరావు, తునికి చెందిన కశిరెడ్డి దుర్గారత్నంలు కేంద్రప్రభుత్వ విద్యాసంస్థలో ఉద్యోగాలిప్పిస్తామని బొద్దవరం గ్రామానికి చెందిన గెద్దం ప్రేమ్‌కుమార్ నుంచి రూ.2.8 లక్షలు, ఎస్సార్‌పేటకు చెందిన రొట్టెల రాజు నుంచి రూ. 3.8 లక్షలు, అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ఎస్‌బీ పట్నంకు చెందిన పాట్నూరి శివకుమార్ నుంచి రూ. 4.3 లక్షలు వసూలు చేశారు. నిందితులు యువకులకు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి మోసగించడంతో వారు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కళానిధి

తుని: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్‌లో శ్రీప్రకాష్ విద్యార్థి కళానిధి అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని విద్యాసంస్థల ప్రిన్సిపల్ మూర్తి మంగళవారం తెలిపారు. ఈ మేరకు రోడ్ 100, 500 మీటర్లలో రెండు గోల్డ్ మెడల్స్, రింక్ 500, రింక్ 1,000 మీటర్లలో కాంస్య పతకాలు సాధించాడన్నారు. విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

నకలీపై నోరు విప్పు పవన్..!

- పవన్‌పై తోట నరసింహం ధ్వజం
- నాడు కల్తీ మద్యం అని శివతాండవం
- నేడు నీ మౌనం వెనుక అర్థం ఏమిటి.?



కల్తీ మద్యానికి నిరసనగా జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్ సీపీ నేతలు



సీఐకి వినతిపత్రం సమర్పిస్తున్న తోట నరసింహం, రాంజీ తదితరులు

జగ్గంపేట: రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని, మద్యం విక్రయాలు అడ్డు అదుపులేకుండా పోతున్నాయని, ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నకిలీ దీనిపై నోరు విప్పకపోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం మండిపడ్డారు. నకిలీ మద్యం, బెల్టు దుకాణాలకు వ్యతిరేకంగా మంగళవారం జగ్గంపేటలో ఆందోళన చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మాజీ మంత్రి తోట నరసింహం, రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు తోట శ్రీరాంజీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెద్ద ఎత్తున జగ్గంపేట బస్టాండ్ ప్రాంతానికి ర్యాలీగా చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆవేశ ఉపన్యాసాలు ఏమయ్యాయి..?

అనంతరం బస్టాండ్ నుంచి స్థానిక పోలిసు స్టేషన్ వద్ద డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌కు అందచేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ మద్యం పేరు ఎత్తితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై శివతాండవం చేసి ఆవేశంతో ఉపన్యాసాలు ఇచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతున్న మద్యం గురించి ఎందుకు నోరు విప్పటం లేదు అని ప్రశ్నించారు.

మంచినీరు సైతం దొరకని గ్రామాల్లో విక్రయాలు

బడి, గుడి లేకుండా ప్రతి గ్రామంలో బెల్టషాపులు వెలిసాయని, కూటమి పాలనలో మంచినీరు దొరకని ప్రాంతాల్లో సైతం మద్యం స్వేచ్ఛగా దొరుకుతోందని దుయ్యాబట్టారు. బెల్టు షాపుల్లో మద్యం ధరలు బాటిల్‌కు రూ.20 రూపాయిలు పెంచి అమ్ముతున్నారని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం నుంచి ప్రభుత్వం అనుమతి పొందిన షాపుల్లో బాటిల్ 10 రూపాయిలు అదనంగా వసూలు చేస్తున్నారని గతంలో ఏ ప్రభుత్వం కూడా మద్యంపై ఇంత దోపిడి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు గల్లా ఏడుకొండలు, కరుటూరి శ్రీనివాస్, గండేపల్లి ఎంపిపి చలగళ్ల దొరబాబు, రామకుర్తి మూర్తి, వరపుల సూరిబాబు, కరుటూరి వీర్రాజు, రావుల గణేషరాజా, ఒబిణ్ణి వీరబాబు, పాలిపిరెడ్డి సత్యనారాయణ, సప్పా రఘు, వివిధ మండలాలకు చెందిన నేతలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహాల్లో తనిఖీలు



కేజీబీవీ వంటశాలను పరిశీలిస్తున్న ఆఫీసర్ శ్రీధర్, ఎంపీడీఓ సాయినవీన్

తుని రూరల్: వి.కొత్తూరులో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాలను నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం కేజీబీవీలో మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ ప్లాంట్ పని చేయకపోవడాన్ని గుర్తించి ప్రిన్సిపాల్ అమృతవాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైన విషయాన్ని కలెక్టర్ షన్మోహన్‌కు నివేదిస్తానన్నారు. మధ్యాహ్నం భోజనం తీసుకుని రుచులు పరిశీలించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థినులు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కె.సాయినవీన్ పాల్గొన్నారు.

నిరసనకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నేతలు



నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు కూటమి ప్రభుత్వం నకిలీ మద్యానికి వ్యతిరేకంగా జగ్గంపేటలో మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తోట నరసింహం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి గోకవరం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ ఎస్సీ సెల్ సాధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సమ్మెటి నాని, కాకినాడ జిల్లా సెక్రటరీ మడికి మైనర్‌బాబు, క్రిస్టియన్ మైనారిటీ సెక్రటరీ అంబటి అబ్రహాం, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూలా అబ్బులు, మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బిజ్జి రాజు, టౌన్ అధ్యక్షులు బడితబోయిన చిన్న, పాటి వివేక్, కురాకుల సుమంగలి తదితరులు ఉన్నారు.

పగలే వెలుగులు



ఏలేశ్వరం షిర్డీనగర్‌లో పగలు వెలుగుతున్న లైట్



రూపులమ్మ గుడి వద్ద నిత్యం వెలుగుతున్న వీధిదీపం

ఏలేశ్వరం: భవిష్యత్ తరాలకోసం విద్యుత్‌ను పొదుపు చేయాలని ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని ప్రజలతు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో వెలగాల్సిన వీధిదీపాలు పట్టపగలు వెలుగుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని దిబ్బలపాలెం, సువ్వయ్యమ్మపేట, సాయినగర్, మార్కెట్‌వీధి, షిర్డినగర్‌లలో గత కొన్నిరోజులుగా వీధిదీపాలు పగలు వెలుగుతున్నాయి. వీటిపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఫిర్యాదులు చేసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే



జగ్గంపేటలో విక్రయ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

జగ్గంపేట: దీపావళి సందర్భంగా జగ్గంపేటలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాలను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, మండల అధికారులు మంగళవారం పరిశీలించారు. బాణసంచా విక్రయించే దుకాణదారులు ప్రభుత్వం సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జెవిఆర్ రమేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

మామిడి, జీడిమామిడి సాగులో సస్యరక్షణ కీలకం



తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వెంకట నరసింహారావు

కోటనందూరు: మామిడి. జీడిమామిడి సాగులో మంచి దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు కీలకమని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు పేర్కొన్నారు. బిళ్లనందూరు, ఇండుగపల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి, జీడిమామిడిలో పూత, కాయ దశలోనే కాకుండా పంట అనంతరం సస్యరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యం, కొమ్మల కత్తిరింపు వంటి చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. మామిడి, జీడిమామిడి తోటలను సందర్శించి సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. మండల ఉద్యాన అధికారిణి ఎస్.సుజాత, వీహెచ్‌ఏలు లగుడు శ్రీను, శ్రీలేఖ, సాయి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అలరించిన కాశీ కావిడి నాటక ప్రదర్శన



కాశీకావిడి వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరిశంకరుల 89వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కళాకారులు కాశీ కావిడి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో గురువుగా బలిజి వీర్రాజు, శిష్యులుగా, మహిళలుగా దండా చిన్నారావు, మంతిన శ్రీను, ఇనపకుర్తి వీరబాబు, గరగ వీరబాబు, దండా అనిల్ కుమార్, మంతిన లోవ రాజు, చెన్నాడ శివ, మట్టా మనోజ్‌కుమార్ నటించారు.

ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సుపై శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సుపై శిక్షణ తరగతులు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోలార్ సిస్టం డిజైన్, సూర్యరశ్మిని ఉపయోగించి సోలార్ పవర్‌ని ఎలా జనరేట్ చేయాలి, ఇంటెలిజెంట్ అల్గోరిథమ్స్ ఉపయోగించి సోలార్ పవర్ సిస్టం సామర్థ్యాన్ని ఏ విధంగా పెంచాలి అన్న అంశంపై ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్టు పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన స్ట్రక్చరల్ డిజైనింగ్ యూజింగ్ ఎటాబ్స్, బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూజింగ్ ఆటో క్యాడ్ అనే రెండు వర్క్‌షాపులు విజయవంతంగా ముగిసినట్టు ఆయన పేర్కొన్నారు.

అడవిపందిని వేటాడిన వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా తలుపులు అడివి పందిని వేటాడి మాంసాన్ని కోస్తుండగా మంగళవారం పట్టుబడ్డాడని శంఖవరం అటవీ సెక్షనాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఎవరైనా వన్యమృగాలను వేటాడితే అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో వన్య మృగాలను వేటాడి వాటి మాంసాన్ని యథేశ్చగా విక్రయాలు చేపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అటువంటివారు ఎవరైనా పట్టుబడితే అటవీ సెక్షన్ ప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అటవీ సిబ్బంది ఉన్నారు.

చర్చిలో మైక్‌సెట్ చోరీ

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని షాలోమ్ ప్రార్థన మందిరంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. చర్చి తలుపులు బద్దలుకొట్టి సుమారు రూ.లక్ష విలువైన మైక్ సెట్ బాక్సులను దొంగలు ఎత్తుకెళ్లారని . మంగళవారం ఉదయం చర్చి సభ్యులు వచ్చి చూడగా తలుపు తాళాలు పగులుగొట్టి ఉండటంతో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై చర్చి నిర్వాహకుడు ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు సేవించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహన్‌రావు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపట్నం గ్రామానికి చెందిన సంగన సత్తిబాబు (32)కు అదే గ్రామానికి చెందిన పార్వతితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు సతీష్, ఎనిమిదేళ్ల కుమార్తె స్వాతి ఉన్నారు. సత్తిబాబు తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. తరచుగా మద్యానికి అలవాటుపడిన సత్తిబాబు ఆర్థికంగా అప్పులు పాలయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం బెండపూడి శివారులో మద్యం సేవించి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో తునిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై మృతుని భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

తొండంగి: మండలంలోని యర్రయ్యపేట పంచాయతీ శివారు అన్నయ్యపేటలో జూదం ఆడుతున్న ఏడుమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు మంగళవారం తెలిపారు. అన్నయ్యపేట శివారులో కార్డులతో ఓడు గెలుపు బెట్టింగ్ ఆట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో దాడిచేశారు. తనిఖీల్లో తుని మండలం ఎస్.సూరవరంకు చెందిన వి.రమణ, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజవరం గ్రామానికి చెందిన జి.జ్యోతిబాబు, నక్కపల్లి మండలం దొడ్డిగొల్లు గ్రామానికి చెందిన పి.దుర్గయ్య, ఎస్.రాయవరం గ్రామానికి చెందిన జి.నాగేశ్వరరావు, తాటియాకుల పాలెంకు చెందిన ఎస్.ధర్మరాజు, ఎం.రామకృష్ణ, ఎస్.అప్పారావులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.81,903 నగదు, 54 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లాభసాటి సాగు పద్ధతులు పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

ఏలేశ్వరం: పంట సాగులో రైతులు లాభసాటి పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని యర్రవరంలో మంగళవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలసాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీవన ఎరువుల వినియోగాన్ని రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా పర్యవరణ పరిరక్షణతోపాటు భూమి సారవంతంగా ఉంటుందన్నారు. అనంతరం అరటి, బొప్పాయి, జామ తదితర పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, మైరాల కనకరావు, బసా ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బాణసంచాతో జాగ్రత్త..!



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

తుని రూరల్: నిబంధనలకు లోబడి బాణసంచా విక్రయించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జివిఎస్.ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం తుని రెవెన్యూ కార్యాలయంలో పోలీసులు, మున్సిపాల్, అగ్నిమాపక, కమర్సిల్ ట్యాక్స్ అధికారులు, దుకాణదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. బాణసంచా విక్రయించే ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా తాత్కాలిక లైసెన్స్ పొందాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండ జాగ్రత్తలు పాటించాలని, నిర్దేశించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండ దుకాణాలు ఏర్పాటు చేయొద్దన్నారు. రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, మున్సిపల్ కమీషనర్ వెంకట్రావు, పట్టణ ఎస్సై విజయబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఫైర్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, దుకాణదారులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



సీఐటీయూ నూతన కార్యవర్గ సభ్యులతో సత్తిరాజు

కోటనందూరు: పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని సీఐటీయూ కాకినాడ జిల్లా సీనియర్ నాయకులు సత్తిరాజు అన్నారు. స్థానిక నూకాలమ్మ గుడి ఆవరణలో సీఐటియూ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం మంగళవారం జరిగింది. సత్తిరాజు మాట్లాడుతూ కార్మికులంతా సంఘటితంగా ఉండి హక్కుల సాధనకై పోరాటాలు చేయాలన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నూతన కార్యవర్గ కన్వీనర్‌గా షేక్ పద్మ, కో కన్వీనర్‌గా ముక్కుడుపల్లి బాబూరావుతో పాటు మరో 18 మందిని సభ్యులుగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో అంకంరెడ్డి రమణమ్మ, లీల, పద్మ, లోవకుమారి, శ్రీదేవి, మరియారత్నం తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షల సొత్తు అపహరణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం సాయిబాబు గుడి సమీపంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పలివెల లక్ష్మీనారాయణ భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న అతడి కుమారుడు సంతోష్ దగ్గరకు పది రోజుల క్రితం వెళ్లారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలు కొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువాలోని 15 కాసుల బంగారం, రూ.2 లక్షలు నగదు, విలువైన వస్తువులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోపాలపురం: మండలంలోని సగ్గొండ 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. నారాయణ అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురం, జగన్నాధపురం, సగ్గొండ గ్రామాల వినియోగదారులు సహకరించాలన్నారు.

15 లక్షల బీమా చెక్కు పంపిణీ

జగ్గంపేట: గండేపల్లి మండలం జెడ్.రాగంపేటకు చెందిన కట్టు పద్మనాభం ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన జగ్గంపేట పోస్టాఫీస్‌లో కట్టిన పాలసీ 15 లక్షల బీమా చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు అధికారులు అందించారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బాధిత కుటుంబానికి చెక్కును అందించి మాట్లాడుతూ..ఆటో కార్మికులకు సైతం పోస్టల్ బీమా ఎంతో మేలు చేస్తుందని సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

22 మద్యం దుకాణాల్లో తనిఖీలు

సామర్లకోట: పెద్దాపురం ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని 22 మద్యం దుకాణాలను మంగళవారం తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కేవీ దుర్గార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ మద్యంపై 'సాక్షి'లో వచ్చిన కథనంతో తమ సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు. అయితే ఎక్కడా నకిలీ మద్యం లభించలేదని తెలిపారు. అదే విధంగా నేర ప్రదేశాలుగా గుర్తించిన ప్రాంతాలలోను తనిఖీ చేయగా కల్తి మద్యం తయారీ జాడలు కనిపించలేదన్నారు. నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసినా, తయారు చేస్తున్నట్లు తెలిసిన వారు పెద్దాపురం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు



మరమ్మతులు చేపట్టిన కల్వర్టు

సాక్షి ఎఫెక్ట్

శంఖవరం: మండల కేంద్రం శంఖవరంలోని శివాలయం వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై ఈ నెల 6న సాక్షి పత్రికలో ప్రమాదకరంగా కల్వర్ట్ శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు నిర్వహించి స్లాబ్ రాయి (సిమెంటు బిళ్లలు) వేశారు. దీనితో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.